తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘము
Telugu Literary And Cultural Association

# అనగనగా

## మల్లప్ప ఉపాయం

పల్లవిశ్రీరాం

అనగనగా ఒక ఊళ్ళో సోమన్న. సోమన్న పరమ తుంటరి మనిషి. వాడింటికి అటూ ఇటూ సూరయ్యా, మల్లప్పల ఇళ్లున్నవి. పొరుగిళ్లవాళ్లని ఏదో విధంగా తిట్టి, కవ్వించి వినోదించడం సోమన్న అలవాటు. అందుకోసం వాడు, వాళ్ల మీద వెకిలి పాటలు కట్టి గొంతెత్తి పాడేవాడు. వాళ్లు దారిలో ఎదురైతే వేళాకోళంగా నవ్వి పలకరించకుండా వెళ్లిపోయేవాడు.

ఐతే, మల్లప్ప ఇలాంటివి పట్టించుకునేవాడు కాడు. వాడు సోమన్న ఆగడాలన్నీ భరించి వూరుకునేవాడు. సూరయ్య మాత్రం అలా వూరుకోలేక చాలాసార్లు సోమన్నతో గొడవ పెట్టుకున్నాడు. వీడిక్కావలసిందీ అదే గనక వీడు పెద్దగా అరుస్తూ సూరయ్య మీదికి వెళ్లేవాడు. దాంతో సూరయ్య హడలిపోయి చల్లగా ఇంట్లోకి దూరేవాడు. సోమన్న మాత్రం అతడితో ఆ గొడవ వదిలిపెట్టక, 'నన్ను రెచ్చగొడితే నేను మనిషిని కాను. చూడు నిన్నేమి చేస్తానో!' అని ప్రతిఘ్న చేసేవాడు.

సోమన్న నోటి దురుసుతనంతో పాటు పక్క ఇళ్లవాళ్లను బాధపెట్టేందుకు, తన ఇంటి ముందు పోగయిన తుక్కునంతా వాళ్ల ఇళ్ల ముందుకు తుడిపించసాగాడు. ఇలా చేస్తే, సూరయ్యతో పాటు మల్లప్ప కూడా తన మీదకి దెబ్బలాడ వస్తాడనీ, అప్పుడు అతణ్ణి నాలుగు తిట్టి వినోదించవచ్చనీ ఆశపడ్డాడు. కానీ మల్లప్ప ఈ సంగతే పట్టించుకోలేదు. తనతోపాటు మల్లప్ప కూడా కలిస్తే, సోమన్నకు బుద్ధి చెప్పవచ్చని సూరయ్య ఆలోచించాడు.

సూరయ్య ఈ సంగతి మల్లప్పతో అన్నప్పుడు మల్లప్ప తేలిగ్గా నవ్వేసి, 'చూడు సూరయ్యా! ఇరుగు పొరుగులతో గొడవలు పడడం నాకిష్టం ఉండదు.' అన్నాడు.

ఈ జవాబు సూరయ్యకు కోపం తెప్పించింది. వాడు ఆ కోపంలో ఒకనాడు మల్లప్ప చూడకుండా, తన ఇంటి ముందున్న చెత్తా చెదారాన్ని వాడింటి ముందు పడేయించాడు. ఐనా మల్లప్ప ఏమీ పట్టించుకోలేదు.

ఇలా రెండు రోజులు గడిచాక సూరయ్య మల్లప్పను పలకరించి, 'ఆ సోమన్న నీకూ నాకూ పోట్లాటపెట్టాలని, నా ఇంటి ముందు తుక్కు కూడా నీ ఇంటి ముందుకు తోస్తున్నాడు. రానురాను వాడి ఆగడాలు మితిమీరి పోతున్నాయి. ఇందుకు మనం ఏదైనా చేయాలి' అన్నాడు. అందుకు మల్లప్ప 'వాడి బుద్ధి నీకు తెలిసింది కదా. మనం గొడవ లేపకుండా వుంటే సరిపోతుంది. నాకు నువ్వంటే నమ్మకమే' అన్నాడు.

సూరయ్య తెల్లబోయి 'ఐతే మాత్రం , ఇంత తుక్కు నీ ఇంటి ముందు వేస్తుంటే, చూస్తూ వూరుకుంటావా?' అని అడిగాడు. 'దానికేముంది, ఇంటి ముందెలాగూ రోజు శుభ్రం చేసుకుంటాం గదా - పనిలో పనిగా ఆ తుక్కు కూడా తుడిచేస్తే సరిపోతుంది' అన్నాడు మల్లప్ప చాలా నెమ్మదిగా.

'నువ్విలా వుండబట్టే, ఆ సోమన్నగాడు మరీ ఇలా బరితెగించిపోతున్నాడు. ఏది ఏమైనా సరే, వాడికి తగిన శాస్తి చేయాల్సిందే' అన్నాడు సూరయ్య కోపంగా.

మల్లప్ప ఎంతో శాంతంగా, 'ఒక సంగతి బాగా గుర్తుంచుకో సూరయ్యా, ఇంటి ముందు కాస్త తుక్కున్నా, ఎక్కువ తుక్కున్నా, దానిని తుడవడానికి పట్టే సమయంలో ఆట్టే తేడా వుండదు. అలా కాక, సోమన్నతో గొడవల్లోకి దిగామంటే బోలెడు కాలం వృథా.' అన్నాడు. 'అలా అని వూరుకుంటే వాడు మనని చేతకానివాళ్లని అనుకోడా?' అన్నాడు సూరయ్య.

'మనం చేతకానివాళ్లం కానప్పుడు, వాడలా అనుకుంటే మాత్రం ఏం నష్టం ? ఒకవేళ మనం నిజంగానే చేతకాని వాళ్లం అనుకో, అప్పుడు వాడలా అనుకోవడంలో తప్పు లేనట్టేగా ?' అన్నాడు మల్లప్ప. సూరయ్య కొంచెం సేపు అలోచించి, 'తలుచుకుంటే మనం కూడా వాడిని 100 రెట్లు ఎక్కువగా బాధలు పెట్టగలం' అన్నాడు. 'అదెలా సాధ్యం సూరయ్యా? ఆ సోమన్నగాడికి ఏ పనీ లేదు, మనకు బోలెడు పనులు. ఐనా ఉపాయశాలి ఎటువంటి యిబ్బందినైనా తనకనుకూలంగా మార్చుకుంటాడు. సోమన్న నాకు ఉపకారం చేసాడనే చెప్పాలి' అన్నాడు మల్లప్ప.

'సోమన్న నీకు ఉపకారం చేసాడా ?' అని చెప్పలేనంత ఆశ్చర్యంగా అడిగాడు సూరయ్య. 'అవును, సోమన్న ఆగడాలు నాకు మా ఇంట్లో వాళ్లకూ భరించటం కష్టంగానే వున్నది. వాణ్ణి తలచుకుంటే మాకూ ఒళ్లు మండిపోతుంది. అందుకని, వాణ్ణి తలవనే తలవరాదని నిశ్చయించుకున్నాం. వాణ్ణి తలవకుండా వుండాలంటే, ఎవరికీ తీరుబడి వుండకూడదు.'

అన్నాడు మల్లప్ప.

'అందుకు నువ్వేం చేసావు?' అడిగాడు సూరయ్య. 'నేను ఇదివరకటికంటే ఎక్కువగా పొలం పనుల్లో వుండిపోతున్నాను. మా ఇంట్లో మిగిలినవాళ్లు అందరూ బుట్టలల్లడం , చాపలు నేయడం , బొమ్మలు చేయడం లాంటి పనుల్లో క్రమంగా ప్రావీణ్యం సంపాయించారు. అందువల్ల కుటుంబానికి అదనపు ఆదాయం వస్తున్నది. దీన్నిబట్టి చూస్తుంటే, సోమన్న వల్ల మాకు ఉపకారం జరిగిందని, నీకూ అనిపించటం లేదూ?' అని అడిగాడు మల్లప్ప.

ఇది విని సూరయ్య తెల్లబోయాడు. మల్లప్పకు వస్తానని చెప్పి ఇంటికిపోయి, భార్యకు సంగతి వివరించాడు. 'అయ్యో, నాకీ అలోచన రానేరాలేదు. మనమూ మల్లప్ప లాగే చేద్దాం.' అన్నది సూరయ్య భార్య. ఆనాటి నుండీ సూరయ్య, వాడి కుటుంబం మల్లప్ప లాగే చేయసాగారు. అందువల్ల, వాడికీ ఆదాయం పెరిగింది. సోమన్నను గురించి ఆలోచించడానికే వ్యవధి వుండడం లేదు. ఇలా కొంతకాలం గడిచేసరికి సోమన్న ఇంటికి అటూ ఇటూ రెండు డాబా ఇళ్లు లేచాయి. తన అల్లరీ, తిట్లూ సూరయ్య, మల్లప్ప లు పట్టించుకోకపోవడం సోమన్నకు పెద్ద బాధగా తయారయింది. ఆ బాధకు తోడు వాళ్లు డాబా ఇళ్లు కట్టడం చూసి సోమన్న చెప్పలేనంతగా మనోవ్యాధికి గురయ్యి, 'నా కారణంగానే వీళ్లు పూరిపాకల స్థాయి నుండి డాబా ఇళ్ల స్థాయికి ఎదిగిపోయారు. మరి కొంతకాలం నేనిక్కడవుంటే, వీళ్లు పెద్ద పెద్ద మేడలే కట్టవచ్చు!' అని ఆలోచించి, తన ఇల్లును తెగిన కాడికి అమ్మి, మరో వూరుకు వెళ్లిపోయాడు.

**నీతి:** కనుక పిల్లలూ, ఎదుటి వాళ్ళను నిందించడం మానుకుని మన పని మనం చూసుకుంటే అందరికీ లాభం....